క్లుప్తంగా

రైలునుంచి పడి ఒకరికి గాయాలు

కమలాపూర్ : రైలు నుంచి కిందపడి ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌కు చెందిన ర్యాకం సారంగం హైదరాబాద్ నుంచి ఉప్పల్‌కు వస్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. తాను దిగాల్సిన ఉప్పల్ రైల్వే స్టేషన్ రావడంతో రైలు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్‌కు తరలించారు.

ముగ్గురిపై కేసు నమోదు

దామెర : మహిళపై దాడిచేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసిన ఘటన దామెర పోలీస్ స్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 17 తేదీన రాత్రి గుట్ట పైనుంచి గజవాహనం స్వామివారి శోభయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామంలోని అందె స్వరూప ఇంటి వద్దకు చేరకున్న యాత్రలో అదే గ్రామానికి చెందిన జిట్టబోయిన గణేష్, జిట్టబోయిన రితీష్, జిట్టబోయిన రాకేష్ మద్యం మత్తులో విజిల్స్ వేస్తు వీరంగం సృష్టించారు. దీంతో ఎందుకు ఇలా చేస్తున్నారంటూ స్వరూప వారిని అడగగా వారు ఆమెను దుర్భాషలాడుతూ నేలపైకి తోసి, కడుపుపై కాళ్లతోదాడి చేశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతామంటూ బెదిరించారు. తనను దుర్భాషలాడి దాడిచేసిన ముగ్గురిపై స్వరూప ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

దామెర : ఒగ్లాపూర్‌లోని తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల (పరకాల)లో ప్రవేశాల కొరకు దఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో మైనారిటీ, నాన్ మైనారిటీ సీట్లు, 6 నుంచి 8వ తరగతి వరకు మైనారిటీ సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రవేశాలకు ఫిబ్రవరి 6 చివరి తేది అని, వివరాల కోసం 7995057981 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని ఆమె కోరారు.

కమిటీ పేరుతో కాలయాపన

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా కమిటీ పేరుతో బీజేపీ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తొమ్మిది సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పుతూ మాదిగల ఓట్లు దండుకున్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ వర్గీకరణ చేయలేదన్నారు. హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ పెట్టిందని మరోసారి మోసం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు.

సీహెచ్‌సీ సందర్శన

కమలాపూర్ : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సీహెచ్‌సీలోని అన్ని వార్డులు పరిశీలించి వైద్యులు, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు పేషేంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను, మందుల గదిని, ఆస్పత్రి రికార్డులు, మందుల నిల్వను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జఫర్‌ఘడ్ సూపరిండెంట్ డాక్టర్ చంద్రమౌళి, కమలాపూర్ సీహెచ్‌సీ సూపరిండెంట్ డాక్టర్ నరేష్, డ్యూటీ డాక్టర్లు రవి, భానుచందర్, విజిత, విరాట్, లక్ష్మీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురం జీఎంజే జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీపతి అక్షర జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో గతేడాది అక్టోబర్ 9,10,11వ తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అక్షర ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి అండర్ 19 కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 24వ తేదీ నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, సర్పంచ్, కబడ్డీ అసోసియేషన్ జనగామ జిల్లా కార్యదర్శి, పీఈటీ క్రీడాకారిణిని అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి వంశీ, పవన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా జీవన జ్యోతి పరస్పర సహాయ సహకార సంఘం సభ్యులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వంశీ కుటుంబ సభ్యులకు రూ.43వేలు, పవన్ కుటుంబ సభ్యులకు రూ.17వేలు ఆర్థిక సాయం అందించారు.

‘బడి’ని బలోపేతం చేయాలి



శాయంపేట : సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీలత

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యాభివృద్ధికి కృషి చేసే కమిటీనే ఎన్నుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సూచించారు. ఈనెల 29వ తేదీన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత తెలిపారు. మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో శనివారం పేరేంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల ఎన్నికలు తరగతికి ముగ్గురి చొప్పున కోఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరుగుతుందని తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఓటు వేస్తారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రకటించడం జరిగిందని, 22న అభ్యంతరాల స్వీకరణ, 24న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. 29న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఐనవోలు : జీపీ, పాఠశాల నోటీసు బోర్డులపై అంటిస్తున్న నోటిఫికేషన్ పత్రం

ఐనవోలు : ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠశాల నోటీస్ బోర్డుతో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అంటించారు. ఈనెల 20 మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటరు జాబితా ప్రకటన, 22, 23వ తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 24వ తేదీన తుది జాబితా విడుదల చేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. 29వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని, 2 గంటలకు ఎస్‌ఎంసీ తొలి సమావేశం ఉంటుందని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొని తమ పిల్లల భవిష్యత్ కోసం పనిచేసే మంచి కమిటీని ఎన్నుకోవాలని కోరారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యతోనే సమాజంలో అత్యంత గౌరవం



మాట్లాడుతున్న పరికిపండ్ల అశోక్

ధర్మసాగర్ : సమాజంలో అత్యంత గౌరవం విద్యతోనే లభిస్తుందని సైకాలజిస్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మండలంలోని ముప్పారం కస్తూర్బా విద్యాలయంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శక్తివంతమైన ఆలోచనలు, నమ్మకాలు అలవాట్లు ఉన్న సామాన్యుడు కూడా శక్తివంతంగా మారవచ్చన్నారు. విద్యార్థులు చదువుకునే వయస్సులోనే వ్యక్తిగత వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువుతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చన్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రేరణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాలను పెంపొందించేందుకు, పరీక్షల్లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ఉచితంగా ప్రేరణ సదస్సులు సైకాలజిస్టుల సంఘం సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 9989310141 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మిట్టపల్లి మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పద్మ, సువర్ణ, కవిత, కృష్ణవేణి, రజిత, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతర కమిటీ చైర్మన్ పదవి మాదిగలకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

వేలేరు : మండలంలోని పీచర సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ చైర్మన్ పదవి మాదిగలకే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంగారపు శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక సమ్మక్క–సారలమ్మ ఆలయ ఆవరణంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన జాతర కమిటీ ఎన్నికలో వివిధ కులాలకు చెందిన డైరక్టర్లు మాదిగ సామాజికవర్గానికి చెందిన కొయ్యడ మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అన్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు, అగ్రవర్ణాలకు చెందిన నాయకులు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి ఎలా ఇస్తారంటూ గొడవకు దిగారని ఆరోపించారు. దీంతో గొడవను సాకుగా చూపి జాతర కమిటీ వేయకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తామని సర్పంచ్ స్వంత నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. మెజారిటీ డైరక్టర్లు కొయ్యడ మహేందర్‌కే మద్దతు తెలిపినందున చైర్మన్ పదవి అతనికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కనకం రాజయ్య, రామంచ ఏసు, కొయ్యడ బాబు పాల్గొన్నారు.

కేవీకే ఆధ్వర్యంలో రాజశ్రీ కోళ్ల పంపిణీ



రాజశ్రీ కోళ్లను పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఐనవోలు : పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మామునూర్, సింగారం రైతులకు ఆరు వారాల రాజశ్రీ కోళ్లను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం డైరక్టర్ డాక్టర్ రాజన్న మాట్లాడుతూ.. గుడ్ల ఉత్పత్తిలో మన దేశం 3వ స్థానంలో ఉందని, పెరటి కోళ్ల నుంచి 20.2 బిలియన్ గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్లు చెప్పారు. వాణిజ్య పరంగా కోళ్ల పరిశ్రమ అభివృద్ధి చెందినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పిండి పదార్థలతో కూడిన ఆహారం తీసుకోవడంతో ప్రొటీన్ లోపం ఉంటుందన్నారు. ప్రొటీన్ సమస్యలు తొలగించేందుకు కేవీకే వారు ఇంటి ఆవరణలో పెంచుకునే అనువైన రాజశ్రీ కోళ్లను రూపొందించినట్లు చెప్పారు. ఈ కోళ్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కుక్కలు, పిల్లులు, జంతువుల నుంచి కాపాడుకోవడానికి శరీర సౌష్టవం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దేశవాలీ కోళ్ల కంటే 5 రెట్లు ఎక్కువగా గుడ్లు ఇస్తాయని, 5 నెలలకు రాజశ్రీ కోడి గుడ్లు పెట్టడం మొదలు పెట్టి 72 వారాల్లో 150 నుంచి 180 వరకు గుడ్లు ఇస్తాయని అన్నారు. వీటి ద్వారా వచ్చే గుడ్లను వేరే కోళ్ల ద్వారా పొదిగించుకోవచ్చని అవగాహన కల్పించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ జె శశాంక్, డాక్టర్ జే సాయి కిరణ్, డాక్టర్ గణేష్, డాక్టర్ రాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త భవనంలో ‘పుర’ సేవలు

- రేపటి నుంచి ప్రారంభం

పరకాల : 11 ఏళ్ల తర్వాత పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో పుర(పౌర) సేవలు అందుబాటులోకి వచ్చాయి. 2012 సంవత్సరంలో మల్లారెడ్డిపల్లెలోని బుడిగజంగలకాలనీ సమీపంలో కొత్త మున్సిపాలిటీ భవనానికి శంఖుస్థాపన జరిగినప్పటికీ నిధుల కొరతతో 11 ఏళ్లు పనులకు అంతరాయం కలిగింది. భవనం లోపల పనులు పూర్తికాకపోవడంతో ఉద్యోగుల విధులకు, ప్రజలకు సేవలందించడం ఇబ్బందిగా ఉంటుందని కార్యాలయ సామగ్రి తరలించలేదు, ఎట్టకేలకు పనులు పూర్తికావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ ఆదేశాలతో శుక్రవారం నుంచి పాత మున్సిపాలిటీ కార్యాలయంలో ఉన్న రికార్డులు, కంప్యూటర్లను తరలించారు. సోమవారం నుంచి కొత్త మున్సిపాలిటీ కార్యాలయంలో సేవలు అందించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి అధికారిక ప్రకటన చేశారు.



కొత్త మున్సిపాలిటీ కార్యాలయం

తీన్మార్ మల్లన్నను కలిసిన కాంగ్రెస్ నాయకులు

వేలేరు : ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా మండలంలోని పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని తీన్మార్ మల్లన్న సూచించినట్లు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత

శాయంపేట : ఆడపిల్లలను రక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా మహిళ సాధికారత సంస్థ కోఆర్డినేటర్ లావణ్య అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలను పురుషులతో సమానంగా చూడాలని అన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడం కోసం కుట్టు మిషన్ శిక్షణ, మగ్గం వర్కు, కంప్యూటర్ ట్రెనింగ్ శిక్షణ అందించి ఉపాధి కల్పించే విధంగా సంస్థ కృషి చేస్తోందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం బేటి బచావో బేటి పడావోపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీఓ రంజిత్‌కుమార్, సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాముడి జెండాల పంపిణీ

పరకాల : అయోధ్యలో నిర్మించిన రామమందిరంలో రాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ 21వ వార్డు ప్రజలకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్‌లాల్ రాముల వారి(ధ్వజ) జెండాలను, కాకర పుల్లలను ఉచితంగా పంపిణీ చేశారు. నరసింహారావు, రాజేష్, తిరుపతి, రాజశేఖర్, సూర్య, రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

సంఘవిద్రోహ చర్యలకు పాల్పడొద్దు

ధర్మసాగర్ : సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సెంట్రల్ జోన్ డీసీపీ మహ్మద్ బారీ హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు వేలేరు మండలంలోని రౌడీ షీటర్లకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌రావు, ఎస్సై నర్సింహారావు, వేలేరు ఎస్సై హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరుకారం సినిమాను నిషేధించాలి

ఐనవోలు : ఈనెల 12న విడుదలైన గుంటూరు కారం సినిమాను నిషేధించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సామాజిక తత్వవేత్తలు, పేద ప్రజల రాజ్యం కావాలని ఆచరణతో సాధ్యం చేసిన కామ్రేడ్‌లు కార్ల్ మార్క్స్, లెనిన్ల పేర్లు గుంటూరుకారం సినిమాలో విలన్ పాత్రలకి పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

పరకాల : దుకాణంలో భార్య, భర్తలు పనిచేస్తుండగా గుర్తుతెలియని ఓ బాలుడు సెల్ ఫోన్ మాయం చేశాడు. దుస్తులు కొనుగోలు చేసేందుకు వచ్చిన బాలుడు తమ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన విషయాన్ని బాధితుడు బూర విష్ణు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్‌లు నిందితుడిని ట్రాక్ చేసి పట్టుకున్నారు. ఎత్తుకెళ్లిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితుడికి అందించారు.

బీజేపీ జెండా గద్దె కూల్చివేత

దామెర : పసరగొండలో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన పార్టీ జెండా గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం కూల్చి వేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యదేశంలో అన్ని పార్టీల జెండాలు నిర్మించుకోవడానికి హక్కు ఉందని, గద్దె కూల్చిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

దేశంలో రామరాజ్యం రావాలి

శాయంపేట : దేశ సమగ్ర అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని, రానున్న రోజుల్లో దేశంలో రామరాజ్యం రాబోతోందని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామరావు అన్నారు. మండలంలోని పత్తిపాకలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నిరంతరం కొనసాగే విధంగా నిధులు సమకూర్చుతున్నట్లు చెప్పారు. నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందాలనేదే మోదీ ఆకాంక్ష అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు పని చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని రక్షించగలిగే సార్వభౌమాధికారాన్ని కాపాడగలిగే వ్యక్తి నరేంద్రమోదీ అని కొనియాడారు. 2047 సంవత్సరం వరకు దేశంలో నిరుద్యోగం, అనారోగ్యం, పేదరికం రూపుమాపడమే మోదీ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం సంకల్ప్ వికసిత్ భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- రాష్ట్ర మంత్రులు పొంగులేటి, కొండా

ధర్మసాగర్ : రోడ్డు ప్రమాదాలను నివారిచేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మండలంలోని కరుణాపురం జాతీయ రహదారిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కరుణాపురం జాతీయ రహదారి అండర్ బ్రిడ్జి కింద నుంచి హైదరాబాద్, హనుమకొండ వైపు వెళ్లే రహదారిలో ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు కుడా, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు రోడ్డు మ్యాపును మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నిరవాణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్, సెంట్రల్ జోన్ డీసీపీ మహ్మద్ బారీ, కుడా అధికారి అజిత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు మ్యాపును పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ

వందసార్లు విన్నవించినా తీరు మారదా..?

- సర్పంచ్, అధికారులను నిలదీసిన గ్రామస్తులు

శాయంపేట : ‘గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వందసార్లు మీ దృష్టికి తీసుకొచ్చాం. నిమిషంతో చేస్తాం.. గంటలో పరిష్కరిస్తాం అని మాటలు చెప్పడంతోనే సరిపెడుతున్నారు కానీ ఇప్పటికీ పరిష్కరించింది లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మళ్లీ గ్రామసభలు ఏర్పాటు చేసి సమస్యలు చెప్పండి పరిష్కరిస్తాం అనడం ఎందుకు’ అంటూ స్థానిక సర్పంచ్, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తులు, యువకులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో శనివారం సర్పంచ్ కందగట్ల రవి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు చెప్పండి అనేలోపే గ్రామస్తులు ప్రశ్నల వర్షం కురిపించారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువైందని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. దోమ మందు పిచికారి చేయకుండా కాలయాపన చేశారని అన్నారు. సైడ్ డ్రైన్, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎంపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మశాన వాటికలో నీటి సౌకర్యం, స్నానాల గదుల్లో సరియైన సదుపాయాలు కల్పించకపోవడంతో స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. క్రీడా ప్రాంగణం బోర్డుకే పరిమితమైందని క్రీడాకారులు వాపోయారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువై ప్రజలను కరుస్తున్నాయని వాటిని పట్టించే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీఓ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో స్మశాన వాటిక సమస్య తమ దృష్టికి రాలేదని రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.



అధికారులను నిలదీస్తున్న యువకులు

విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

- కేయూ వీసీ తాటికొండ రమేష్

ఎల్కతుర్తి : విద్యార్థులు కష్టంతో పాటు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేష్ అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని స్వామి రామనంథ తీర్థ కోపరేటీవ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన 35వ వార్షికోత్సవ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విద్య వలనే దేశానికి ప్రధానమంత్రి అయ్యారని అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని చదువుపై ఏకాగ్రత వహించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎడ్యూకేషన్ సొసైటీ చైర్‌పర్సన్ సురభి వాణిదేవి మాట్లాడుతూ.. తన తండ్రి పీవీ నర్సింహారావు అడుగు జాడల్లోనే తాను ముందుకెళ్తానని అన్నారు. తన స్వగ్రామంలో ఉన్న 800ఎకరాల భూమిని పేదలకు దానం చేసినట్లు తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రసాంకేతిక విద్యను విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులతో పాటు గురువులను గౌరవించాలన్నారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. చెడు మార్గాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ తిరుమల రుషి, అకౌంటెంట్ హుస్సేన్‌భాషా, డాక్టర్ ఎదులపురం తిరుపతి, పిడిశెట్టి రాజు, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న తాటికొండ రమేష్

ఘనంగా దర్గా ఉత్సవాలు ప్రారంభం

నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లిలో గల మహమ్మద్ షా హజ్రత్ సయ్యద్ మదార్‌షావలీ దర్గా ఉర్సు ఘనంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం పరకాల జామ మస్జిద్ నుంచి గంధంను షాషాబ్‌ల విన్యాసాలతో ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. కుల, మతాలకతీతంగా హజ్రత్ సయ్యద్ మదార్‌షావలీ దర్గాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. శనివారం సాయంత్రం దర్గా ముతవల్లి మహ్మద్ ఖాజఖాద్రి ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి

సమాజ నిర్మాణంలో జర్నలిజం పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌లాల్

కేయూ క్యాంపస్: సమాజ నిర్మాణంలో జర్నలిజం కీలకపాత్ర వహిస్తోందని కాకతీయ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత సమావేశాన్ని ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులు తమ కోర్సు పూర్తయ్యాక సమాజం కార్యక్షేత్రంగా చేసుకొని పనిచేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కేయూ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులకు మీడియా రంగంలో అనేక అవకాశాలున్నాయని వివరించారు. సమాజంలో జరుగుతున్న పలు అంశాలపై ఆయన విద్యార్థులకు సూచించారు. ప్రజాస్వామ్యంలో జర్నలిజం పాత్ర కీలకమని అన్నారు. సమావేశంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు నరసింహారాములు, శ్రీకాంత్‌యాదవ్, పద్మ, వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్, డాక్టర్ శంకర్, చిరంజీవి పాల్గొన్నారు.